క్లుప్తంగా

కాలువపై అక్రమ నిర్మాణం



కాలువపై నిర్మిస్తున్న కట్టడం

తిరుపతి తుడా : కోట కొమ్మలవీధిలోని వినాయక స్వామి ఆలయ సమీపంలో కాలువపై అక్రమ నిర్మాణం చేపట్టారు. ఆస్పత్రులు అధికంగా ఉండే రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోకి వెళ్లాలంటే ప్రజలు ట్రాఫిక్‌తో అష్ట కష్టాలు పడుతుంటారు. ఈ క్రమంలో నాలుగు రోడ్ల కూడలికి వద్ద కాలువపై టీ షాపును ఏర్పాటు చేసుకునేందుకు స్థల యజమాని కట్టడం నిర్మిస్తున్నారు. ఇరుకు రోడ్లు, ఆపై నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ఆక్రమణ వల్ల ట్రాఫిక్‌కు మరింత అంతరాయం కలిగే అవకాశముంది. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆక్రమణను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

పాకాల : ఎస్సీ, ఎస్టీ టీచర్ల సంఘం బలోపేతానికి ముమ్మరంగా సభ్యత్వ నమోదు చేపట్టినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మునిరత్నం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎ స్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలను ఎవరిపై ఆధారపడకుండా పరిష్కరించుకునేందుకే సభ్యత్వ నమోదు చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం ఎమ్మార్సీ కేంద్రంలో ఎంఈఓ బాబ్జీతో చర్చించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి దామోదరం, మండల అధ్యక్షుడు ప్రభు, ప్రధాన కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంక్ అభివృద్ధే లక్ష్యం



గుంటూరు టౌన్ బ్యాంక్ సీఈఓతో మాట్లాడుతున్న జయ చంద్రారెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : తిరుపతి టౌన్‌బ్యాంక్ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఈ మేరకు డైరెక్టర్లు మబ్బు నాధముని రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అధికారులతో కలిసి గుంటూరు టౌన్‌బ్యాంక్‌ను సందర్శించారు. ఆ బ్యాంక్ సీఈఓ సదానందతో సమావేశమయ్యారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ తిరుపతి టౌన్‌బ్యాంకు అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఖాతాదారులకు అందించాల్సిన ప్రత్యేక సేవలపై చర్చించినటు వెల్లడించారు. సమావేశంలో బ్యాంక్ అధికారులు ప్రకాష్, వెంకటేశన్, చంద్రబాబు పాల్గొన్నారు.


'విద్యుత్' వడ్డనపై నిరసన

పాకాల : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడంపై సీపీఎం, రైతు సంఘం నేతలు ఆందోళనకు దిగారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. రైతు సంఘం నేత హేమలత మాట్లాడుతూ పెంచిన కరెంట్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అసలే ధరల భారంతో ప్రజలు అవస్థలు పడుతుంటే విద్యుత్ చార్జీలను పెంచడం దారుణమన్నారు. శ్రీవారి లడ్డూలపై రాజకీయాలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు పేదల గోడు పట్టడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నేతలు మధుసూదన్ రావు, సుగుణ, కేశవరెడ్డి, రాజు, లక్ష్మయ్య, నవీన్, దేవేంద్ర పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

తిరుపతి తుడా : ఉప్పరపల్లె వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం రుయా ఆస్పత్రిలో పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రుయా ఆస్పత్రి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూపరింటెండెంట్ రవిప్రభుకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ హరికిరణ్ పాల్గొన్నారు.

పరిశ్రమలకు 'స్త్రీనిధి'



మాట్లాడుతున్న జీవీబీడీ హరిప్రసాద్

తిరుపతి అర్బన్ : సూక్ష్మ,మధ్య తరహా పరిశ్రమలకు స్త్రీనిధి నుంచి ఆర్థిక సహకారం అందిస్తామని ఆ విభాగం ఎండీ జీవీబీడీ హరిప్రసాద్ తెలిపారు. బుధవారం తిరుపతి డీఆర్డీఏ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. స్త్రీనిధి రుణాలు పొందిన పొదుపు సభ్యుల నుంచి 100శాతం రికవరీ అయిన తర్వాతే కొత్తవి మంజూరు చేయాలని స్పష్టం చేశారు. డీఆర్డీఏ పీడీ శోభనబాబు, అడిషనల్ పీడీ ప్రభావతి, ఏజీఎం హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

- తిరుపతిలో పెరిగిన హైస్పీడ్ రైడర్లు
- మోటార్‌సైకిళ్లపై దూసుకెళుతున్న యువకులు
- ప్రజలను హడలెత్తిస్తున్న ద్విచక్రవాహనదారులు
- ఒళ్లు గగొర్పొడిచేలా ప్రమాదకర విన్యాసాలు
- రాత్రివేళలో రేస్ కోర్సుల్లా మారుతున్న నగర వీధులు
- తూతూమంత్రంగా స్పందిస్తున్న పోలీసులు

రయ్ రయ్ మంటూ బైక్‌లను ఉరికించాలి.. విశాలమైన రహదారిపై బుల్లెట్‌లా దూసుకెళ్లాలి.. క్షణాల్లో లక్ష్యం చేరుకోవాలి.. తోటి వారితో శభాష్ అనిపించుకోవాలి.. అందరి ముందు కాలర్ ఎగరేయాలి.. సరిలేరు నీకెవ్వరు అని పొగడ్తలు అందుకోవాలి.. ఇలా హీరోయిజం ప్రదర్శించాలనే ఉద్దేశంతో పలువురు యువకులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అత్యాధుని మోటారుసైకిళ్లను అత్యంత వేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. హైస్పీడ్ రైడింగ్ కొందరికి హాబీగా ఉంటే.. మరికొందరు ప్రచారం కోసం తెగిస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళ తిరుపతిలోని రోడ్లను రేస్ కోర్సుల్లా మార్చేస్తున్నారు. భీతిగొలిపే విన్యాసాలతో బండి నడుపుతూ పలువురు మృత్యువాత పడుతున్నారు.

రెచ్చిపోతున్న రేసర్లు





పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు (ఫైల్)

తిరుపతి క్రైమ్ : నగరంలో మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడిపేవారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ఈ క్రమంలో కొందరు యువకులు మరింతగా శ్రుతి మించుతున్నట్టు తెలుస్తోంది. కొంతమంది బైకర్లు బెంగళూరు- పూతలపట్టు జాతీయ రహదారి, జూ పార్క్ రోడ్‌ను రైడింగ్ అడ్డాగా మార్చుకున్నారు. వారాంతాల్లో బృందాలుగా ఏర్పడి బైక్‌లపై విన్యాసాలు చేస్తూ దూసుకెళుతున్నారు. రాత్రివేళల్లో తిరుపతి వీధుల్లో సైతం అత్యంత వేగంగా బైక్‌లను నడుపుతూ ఇతర వాహనదారులను బెంబేలెత్తిస్తున్నారు.

అధిక సామర్థ్యంతో వాహనాలు

ఐదారేళ్ల క్రితం వరకూ 160 సీసీ బైకు అంటే చాలా గొప్ప. పల్సర్ తీసుకోవడమే ఎక్కువని అనుకునే వారు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. 250 సీసీ నుంచి 1,000 సీసీ వరకూ బైక్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవలి 650 సీసీ బైకులు జిల్లాలో భారీగా పెరిగినట్టు రవాణా శాఖ అధికారుల పరిశీలనలో తేలింది. అధిక సామర్థ్యం కలిగిన బైకుల్లో జాతీయ రహదారిపై కనిష్టంగా 160 కిలోమీటర్ల స్పీడు వెళతామని ఒక బైక్ రైడర్ చెప్పుకొచ్చారు. హెల్మెట్, జాకెట్, గ్లౌజులు వేసుకుని నడిపితే స్పీడు మేనేజ్ చేయచ్చునని మరో రైడర్ చెబుతున్నారు. ఇలా హైస్పీడు రైడింగ్‌కు వెళ్లేవారిలో 24 ఏళ్ల లోపు కుర్రాళ్లు అధికంగా ఉండడం గమనార్హం.

ప్రమాదకరంగా..

నగర వీధుల్లో మితిమీరిన వేగంతో బైక్ నడపడం ఒక ఎత్తయితే.. విన్యాసాలు చేస్తూ వెళుతున్న వారిని చూసి ప్రజలు భయపడిపోతున్నారు. కొందరు బైకర్లు ముందు చక్రం పూర్తిగా పైకి లేపి వెనుక చక్రం మీదనే రెండు మూడు కిలోమీటర్లు వెళుతున్నారు. పైగా వెనుకవైపు మరొకరిని కూర్చోపెట్టుకుని కూడా ఇలా చేస్తున్నారు. అలాగే బైక్‌పై వేగంగా వెళుతూ నిలబడి చేతులు వదిలేయడం చేస్తున్నారు. ద్విచక్రవాహనం హ్యాండిల్ దాదాపు నేలకు తగిలేలా నడుపుతుంటే చూపరులకు ఒళ్లు జలదరిస్తుంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే శ్రీనివాస సేతు వంతెనపై విచ్చలవిడిగా విన్యాసాలు చేస్తుండడం గమనార్హం.

అవలీలగా కొనిస్తున్నారు!

ప్రస్తుత పరిస్థితుల్లో 100 సీసీ బైక్ కూడా రూ.లక్ష దాటింది. అలాంటిది 650 సీసీ బైకు ఎంత ఉంటుందో అంచనా వేయలేం. జీటీ 650 బైక్ మార్కెట్లో ప్రస్తుతం రూ.6 లక్షలు పలుకుతోంది. 1,000 సీసీ బైక్ అయితే రూ. 9 లక్షల పైమాటే. ఇంత ఖరీదైన వాహనాలను కూడా తల్లిదండ్రులు అవలీలగా తమ బిడ్డలకు కొనివ్వడం కొందరికి ఆశ్చర్యం కలిగిస్తోంది. అంతటి సామర్థ్యం గల బైక్‌లపై నెమ్మదిగా వెళ్లమంటే పిల్లలు వింటారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



కేసులు తప్పవు

బైక్ రైసింగ్ పాల్పడే వారిపై కేసులు తప్పవు. అలాగే వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తాం. ఖరీదైన బైకులు కొనిస్తే సరిపోదు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు గుర్తించాలి. డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుని నిబంధనలకు అనుగుణంగానే బండి నడపాలి. రేసింగ్‌ల కారణంగా డ్రైవ్ చేసేవాడితోపాటు ఎదుటి వారి ప్రాణాలు కూడా పోయే అవకాశముంది. ప్రస్తుతం బైక్ రేస్‌లపై కట్టుదిట్టంగా నిఘా పెడుతున్నాం. ఈ క్రమంలోనే కొన్ని ప్రాంతాలను సైతం గుర్తించాం. అందులో భాగంగానే రెండు రోజుల క్రితం జూపార్క్ రోడ్‌లో బైక్ రేసింగ్ చేస్తున్నవారిని అదుపులోకి తీసుకున్నాం. వాహనాలను సీజ్ చేశాం. – సుబ్బరాయుడు, ఎస్పీ

విపత్తు సమయంలో ఎన్‌సీసీ సేవలు మరువలేం



ఎన్‌సీసీ క్యాడెట్లతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతి సిటీ: విపత్తుల సమయంలో ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు మరువలేనివి మంత్రి ఎం రామ్‌ప్రసాద్ రెడ్డి కొనియాడారు. బుధవారం వెటర్నరీ వర్సిటీ ఆవరణలోని తిరుపతి 2ఏ ఆర్‌అండ్‌వీ ఎన్‌సీసీ రెజిమెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవవందనం స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ దేశభక్తికి, క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని కొనియాడారు. ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించారని వెల్లడించారు. క్యాడెట్లు నిర్వహించిన హార్స్ షోను తిలకించారు. లెఫ్టినెంట్ కల్నల్ ఆర్ అనూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 75 మంది రక్తదానం చేశారు. వెటర్నరీ వర్సిటీ వీసీ రమణ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సెహ్వాగ్



శ్రీవారి ఆలయం వెలుపల వీరేంద్ర సెహ్వాగ్

తిరుమల : తిరుమల శ్రీవారిని భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

తుడా టవర్స్ పనుల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాయల చెరువు రోడ్డులో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణ పనులను బుధవారం కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా టవర్స్‌లో కల్పిస్తున్న వసతులు, ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలను అధికారులు వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ క్రమంలోనే టవర్స్ బ్రోచర్లను పరిశీలించిన నిర్మాణంలో వినియోగిస్తున్న మెటీరియల్స్, పెయింట్లలపై సూచనలిచ్చారు. జనవరి నెలాఖరులోపు టవర్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో తుడా సెక్రటరీ వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, డీఈ బాషా, ఏఈ షణ్ముగం, కేపీసీ సంస్థ ఈడీ సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థల్లోనే పరీక్ష కేంద్రాలకు వినతి



వీసీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

తిరుపతి సిటీ : ప్రభుత్వ విద్యాసంస్థలలోనే దూరవిద్య పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్వీయూ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ కోరారు. బుధవారం ఈ మేరకు ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, డీడీఈ పరీక్ష కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థలకు కేటాయించారన్నారు. యూజీ, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో నిబంధనలకు ఇది విరుద్ధమని మండిపడ్డారు. పరీక్షలను ప్రభుత్వ విద్యాసంస్థలలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కేంద్రాలలో సీసీ కెమెరాలు, వీడియో రికార్డింగ్, హాజరు, బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీ అధికారులు స్పందించకుంటే ఉన్నత విద్యామండలికి ఫిర్యాదు చేయడంతో పాటు హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు ముని, వెంగళరావు, పవన్, లిఖిత్, సుధీర్, సాయి, విష్ణు, మోహన్ పాల్గొన్నారు.

'వివాహ వేదిక' కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కరపత్రాలను బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. శ్రీవేంకట గాయత్రి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 2025 ఫిబ్రవరి 2వ తేదీన ఇస్కాన్‌రోడ్డులోని కంచి పాదుక మండపంలో పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ సీఆర్‌కే శేష గిరిరావు తెలిపారు. బ్రాహ్మణ కుటుంబీకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల వారు జనవరి 12వ తేదీలోపు పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 9440271154, 7013042281 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో ట్రస్ట్ ప్రతినిధులు ఎంఎస్.విశ్వనాథ్, పి.కామేశ్వరరావు, ఎస్ఎస్.కుమారస్వామి, సి.రాజేంద్రప్రసాద్, బి.జయలక్ష్మి, పి.పద్మావతి, ఎం.లత, పి.అపర్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు అభినందన



బ్యాగ్‌ను ప్రయాణికుడికి అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్ : శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ జె.శ్రీనివాసులును అధికారులు అభినందించారు. బుధవారం తెలంగాణలోని కామారెడ్డికి చెందిన రామకృష్ణ అనే ప్రయాణికుడు శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి ఆర్టీసీ సర్వీసులో వచ్చారు. తన బ్యాగ్‌ను బస్సులోనే వదిలి పొరబాటున దిగేశాడు. అందులో ల్యాప్‌ట్యాప్‌తోపాటు పలు వస్తువులున్నాయి. తిరుపతిలో బ్యాగ్‌ను డ్రైవర్ శ్రీనివాసులు గుర్తించారు. వెంటనే జిల్లా ప్రజారవాణా అధికారి జగదీష్‌కు అప్పగించారు. మరోవైపు ప్రయాణికుడు తన బ్యాగ్ మిస్సింగ్ అయినట్లు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు స్పందించి ప్రయాణికుడిని పిలిపించి బ్యాగ్ అందించారు. దీంతో రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఎమ్మెల్యే ఆరణికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ కోరారు. బుధవారం ఈమేరకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఆటోలపై చలానాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయించాలని సూచించారు. బ్యాడ్జి ఉన్న ట్రక్ డ్రైవర్‌కు రూ.15 వేలు ఇస్తామని, ఇన్సూరెన్స్ కలిపిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు చిన్నం పెంచలయ్య, ఎన్‌డీ.రవి, ఎం.శివ, వెంకటేష్, మహేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

తిరుపతి రూరల్ : మండలంలో గురువారం నుంచి మంగళం-2, తిరుచానూరు, అవిలాల, చెర్లోపల్లె పంచాయతీల కార్యాలయాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈశిబిరాల్లో 6 ఏళ్ల లోపు చిన్నారులకు కొత్త ఆధార్ కార్డుల నమోదు, బయోమెట్రిక్ ప్రమాణీకరణ, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. అంగన్‌వాడీ టీచర్, హెల్పర్లు తమ పరిధిలోని చిన్నారులను గుర్తించి, వారి తల్లిదండ్రుల ద్వారా ఆధార్ నమోదు చేయించాలని సూచించారు.

'సదస్సు'కు 48 వినతులు

భాకరాపేట : రంగన్నగారిగడ్డ గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు వివిధ సమస్యలపై మొత్తం 48 వినతులు వచ్చినట్లు ప్రత్యేకాధికారి రోస్మండ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు పరిష్కారానికే సదస్సు చేపట్టినట్లు వెల్లడించారు. తహసీల్దార్ జనార్దన్‌రాజు, డీటీ వాసుదేవకుమార్, ఆర్ఐ జానకిరామ్, ఉప సర్పంచ్ కిశోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

చంద్రగిరి : ముళ్లపూడి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. వివరాలు.. పాడిపేట శేషాద్రినగర్‌కు చెందిన మురళి, తేజ దంపతులు ద్విచక్రవాహనంలో తిరుపతిలోని బంధువు అంత్యక్రియలకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గం మధ్యలో ముళ్లపూడి సమీపంలోని పైపుల ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మురళి, తేజతోపాటు, మరో ద్విచక్ర వాహనంలోని సంగీతకు గాయాలయ్యాయి. తిరుచానూరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను రుయాకు తరలించారు.

వ్యభిచారం గృహంపై దాడి

చంద్రగిరి: విద్యుత్‌నగర్‌లో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై బుధవారం తిరుచానూరు పోలీసులు దాడి చేశారు. బళ్లారికి చెందిన కుమార్ ఓ హోమ్ స్టేలో వ్యభిచారం నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేశారు. అక్కారాంపల్లెకు చెందిన సోమశేఖర్, దేవశంపేటకు చెందిన పార్థసారథితోపాటు నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. యువతులకు మాత్రం కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేద విద్యావ్యాప్తికి విశేష కృషి



వర్సిటీ అధికారులతో సమీక్షిస్తున్న ఈఓ శ్యామలరావు

తిరుపతి సిటీ: వేద విద్యావ్యాప్తికి, వేద పరిరక్షణకు టీటీడీ విశేష కృషి చేస్తోందని టీటీడీ ఈఓ శ్యామల రావు తెలిపారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ ఐఐటీ సహకారంతో ప్రాచీన భారతీయ శాస్త్రాల్లో ఉన్న విజ్ఞానాన్ని నేటి యువతకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. వేద విద్యావ్యాప్తికి ఆరు వేద పాఠశాలు ప్రారంభించామని వెల్లడించారు. అనంతరం విద్యార్థుల తరగతి గదులు, హాస్టళ్లు, స్టూడియో, తాళపత్ర గ్రంథాలు పరిశీలించారు. పలు పుస్తకాలను ఆవిష్కరించారు. వీసీ రాణి సదాశివమూర్తి, జేఈఓ గౌతమి, రిజిస్ట్రార్ రాధాగోవింద త్రిపాఠి పాల్గొన్నారు.

20 నుంచి కార్గో మాసోత్సవాలు



మాట్లాడుతున్న డీఆర్ నాయుడు

తిరుపతి అర్బన్: కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్గో ఇన్‌చార్జి డీఆర్ నాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి జనవరి 19వ తేదీ వరకు కార్గో మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కిలో నుంచి 50 కిలోల వరకు మాత్రమే డోర్ డెలివరీ ఉంటుందని వెల్లడించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు కార్గో ద్వారా రూ.192 కోట్ల రాబడి వచ్చిందని చెప్పారు. సంక్రాంతి నేపథ్యంలో బహుమతులు, స్వీట్లు తదితర వాటిని ఎక్కువగా కార్గో ద్వారా డోర్ డెలివరీ చేయాల్సి ఉంటుందని వివరించారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా సింహగర్జన



నినాదాలు చేస్తున్న దళిత నేతలు

తిరుపతి కల్చరల్: దళితుల ఐక్యతను విచ్ఛిన్నం చేసే ఎస్సీ వర్గీకరణను సింహగర్జనతో అడ్డుకుందామని దళిత నేతలు పిలుపు నిచ్చారు. బుధవారం మాలల జేఏసీ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు హోటల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. దళిత నాయకులు ఎలమంచిలి ప్రవీణ్, మల్లారపు మధు, సుదర్శన్, పి.ప్రభాకర్, ఏ.అజయ్‌కుమార్, ధనశేఖర్, గోపి, చిరంజీవి, వెంకయ్య, యువజన సంఘాల నేతలు, యూనివర్సిటీ స్కాలర్స్ పాల్గొని, ప్రసంగించారు. వారు మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'సుస్థిర అభివృద్ధి'కి శిక్షణ



బహుమతులు అందిస్తున్న ఎంపీడీఓ

భాకరాపేట : గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించేందుకు శిక్షణ అవసరమని ఎంపీపీ బాల యుగంధర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి స్థానికీకరణ- సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన శిక్షణ తరగతిలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వనరులను ముందుగా గుర్తించాలని కోరారు. డీపీఆర్సీ షణ్ముగం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిడ్డయ్య, ఈఓపీఆర్డీ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామచంద్రాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులకు రెండు రోజుల శిక్షణ ప్రారంభించారు. డీఎల్‌పీఓ సురేష్ నాయుడు మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పిస్తేనే గ్రామీణాభివృద్ధి సాధ్యమన్నారు. ఎంపీడీఓ ఇందిరమ్మ, ఎంఈఓ మార్కొండయ్య నాయుడు, ఏఈ పవన్‌రాజు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

తిరుపతి రూరల్ : సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ముగిసింది. ఉత్తమ ప్రజెంటేషన్ చేసిన వారికి ఎంపీడీఓ రామచంద్ర బహుమతులు అందించారు.

రౌడీషీటర్ నుంచి కాపాడండి

- ఎంఆర్ పల్లి పోలీసులకు ఫిర్యాదు



తలుపులను పగులగొట్టేందుకు ప్రయత్నిస్తున్న జ్ఞానేశ్వర్ రెడ్డి

తిరుపతి రూరల్: రౌడీ షీటర్ జ్ఞానేశ్వర్ రెడ్డి తన అనుచరులతో అర్ధరాత్రి తమ ఇంటిపై దాడిచేయడమే కాకుండా, చంపేస్తామని బెదిరిస్తున్నాడని పేరూరు పంచాయతీకి చెందిన టీడీపీ వార్డు సభ్యుడు మంజు కుటుంబ సభ్యులు తిరుపతి రూరల్ పోలీసులను ఆశ్రయించారు. ఆ మేరకు బుధవారం రాత్రి వార్డు సభ్యుడు కంకి మంజు భార్య లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రౌడీ షీటర్ జ్ఞానేశ్వర్ రెడ్డి, అతని బావమరిది ప్రవీణ్ రెడ్డితో కలిసి మంగళవారం అర్ధరాత్రి పదిన్నర గంటలకు తమ ఇంటిపై దాడిచేశారన్నారు. తలుపులను పగులగొట్టి వార్డు సభ్యుడైన తన భర్త మంజుపై భౌతిక దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు. భయంతో ఇంట్లోకి వెళితే.. తలుపులను కాళ్లతో తన్నుతూ పగులగొట్టేందుకు ప్రయత్నించారని చెప్పారు. దీంతో తలుపు గడులు కూడా విరిగిపోయాయని పేర్కొన్నారు. వారి దాడి దృశ్యాలు తమ ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలో నమోదవుతున్నట్లు గుర్తించి, సీసీ కెమెరాలు సైతం ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారని వాపోయారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దాడి దృశ్యాలను పోలీసులకు సమర్పించినట్లు తెలిపారు. గతంలో కూడా జ్ఞానేశ్వర్ రెడ్డి పలుమార్లు కాలనీలో దాడులకు ప్రయత్నించారని, తన భర్తపై సైతం బెదిరింపులకు పాల్పడినట్లు చెప్పారు. ఇప్పటికైనా పోలీసులు అతనిపై చర్యలు తీసుకుని, అతని నుంచి తమకు ప్రాణరక్షణ కల్పించాలని వేడుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎస్ఐ షేక్షావలి తెలిపారు. జ్ఞానేశ్వర్ రెడ్డిపై తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నది వాస్తవమే అని తెలిపారు.